క్లుప్తంగా

ఆర్థిక సాయం



క్యాన్సర్ బాధితురాలితో మాట్లాడుతున్న కాటసాని ఓబులరెడ్డి

బనగానపల్లె : క్యాన్సర్‌తో బాధపడుతున్న పట్టణంలోని బీసీ కాలనీలో ఖాదర్‌బీని ఆదివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు కాటసాని ఓబులరెడ్డి పరామర్శించారు. ప్రస్తుతం వైద్య అందుబాటులో ఉందని, అధైర్యపడొద్దని ఓదార్చారు. తనవంతుగా రూ.25వేలు బాధితురాలికి అందజేశారు. కార్యక్రమంలో బీసీ కాలనీవాసులు దేవుడు, ముక్తియార్, రసూల్, యేసబ్, సుదర్శన్‌రెడ్డి, మహమ్మద్‌హుస్సేన్, కోనేటి దుర్గా తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌కు ఎల్‌ఈడీ బల్బులు అందజేత



వార్డెన్‌కు ఎల్‌ఈడీ బల్బులను అందజేస్తున్న దృశ్యం

డోన్ : ప్రభుత్వ వసతిగృహాలలో మౌళిక వసతులు కల్పించేందుకు స్థానిక ఇన్నర్‌వీల్‌క్లబ్ ముందుంటుందని క్లబ్ అధ్యక్షురాలు శాలిని అన్నారు. స్థానిక బీసీ బాలికల వసతిగృహంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, న్యాయవాది ముడియాల నాగభూషణంరెడ్డి ఆర్థిక సాయంతో ఎల్‌ఈడీ బల్బులను హాస్టల్ వార్డెన్ లక్ష్మిబాయికి ఆదివారం అందజేశారు. ఇన్నర్‌వీల్ క్లబ్ తరుపున విద్యార్థుల్లో ఏకాగ్రత నెలకొల్పేందుకు యోగా శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని క్లబ్ మాజీ అధ్యక్షురాలు ముడియాల శైలజ తెలిపారు.

పౌష్టికాహారం పంపిణీ



మహిళలకు రొట్టె, గుడ్డు, పప్పు పంపిణీ చేస్తున్న దృశ్యం

డోన్ : స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రతి ఆదివారం చేపట్టే గర్భిణులు, బాలింతలు, రోగులకు పౌష్టికాహారం పంపిణీ కొనసాగింది. కర్నూలు జిల్లా గూడూరు పట్టణానికి చెందిన కుల్లాయి కూతురు సాధామిని ఆర్థిక సాయంతో ఆసుపత్రిలో రోగులకు రొట్టె, పప్పు, గుడ్డు పంపిణీ చేశారు. స్థానిక ప్రార్థన సమయం నిర్వాహకులు జాన్ ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు మున్నా, రాజేష్, పవన్ పాల్గొన్నారు.

సీపీఐ ఎమ్మెల్యే అభ్యర్థిగా రంగనాయుడు



డోన్ రూరల్ : డోన్ నియోజకవర్గం సీపీఐ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎస్.రంగనాయుడిని పార్టీ అధిష్టానం ఎంపిక చేసింది. ఈ మేరకు ఆయనకు నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ తనను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడం చాలా సంతోషంగా ఉందన్నారు.

కరాటే పోటీలను ప్రారంభించిన జడ్జి



పోటీలను ప్రారంభిస్తున్న జడ్జి రాహుల్ అంబేడ్కర్

డోన్ రూరల్ : పట్టణంలోని స్థానిక చాందిని పంక్షన్ హాల్‌లో ఆదివారం కరాటే స్పోర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే పోటీలను డోన్ సివిల్ కోర్టు జడ్జి రాహుల్ అంబేడ్కర్ ప్రారంభించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై దృష్టి సారించాలని ఈ సందర్భంగా జడ్జి సూచించారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజేష్, న్యాయవాది నాగభూణంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

కొలిమిగుండ్ల: త్వరలో జరుగబోయే సాధారణ ఎన్నికల నేపథ్యంలో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ గోపీనాథ్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం రాత్రి బెలుం, బెలుం శింగవరం గ్రామాల్లో పోలీస్, బీఎస్‌ఎఫ్ దళాలతో కలిసి మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

పేరుసోముల...ప్రగతి బాట

- ప్రభుత్వ కార్యాలయాలతో పట్టణ శోభ
- సీసీ రోడ్లతో కళకళలాడుతున్న కాలనీలు
- జగనన్న కాలనీలో 210 మందికి గృహాలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



రూ. 23 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం భవనం

సంజామల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పట్టణాలతోపాటు పల్లెల రూపురేఖలు మారాయి. సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, హెల్త్‌క్లినిక్ భవనాలతో పల్లెలకు పట్టణ శోభ సంతరించుకుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, సీసీ రోడ్ల ఏర్పాటుతో కళకళలాడుతోంది మండల పరిధిలోని పేరుసోముల గ్రామం. ఈ గ్రామ పంచాయతీలో 1,350 కుటుంబాలు ఉండగా దాదాపు 6500 మంది జనాభా ఉన్నారు. గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన పేరుసోముల గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చర్యలు చేపట్టడంతో ప్రగతిబాట పట్టింది. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే ప్రాధాన్యనిచ్చారు. రూ.2.52 కోట్లతో గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, మినరల్ ప్లాంట్ వెలిశాయి. అదేవిధంగా సీసీ రోడ్లు నిర్మించడంతో గ్రామం రూపురేఖలు మారిపోయాయి. పేరుసోముల గ్రామానికి డీబీటీ ద్వారా రూ. 28.66 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ. 11.21 కోట్లు లబ్ధి చేకూరింది. నాడు నేడు నిధులతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కార్పొరేట్ స్కూల్‌ను తలపిస్తుంది. ఎమ్మెల్యే కాటసాని ప్రత్యేక చొరవ తీసుకుని భూమిలేని 150 మంది నిరుపేదలకు భూపంపిణీ చేశారు. అదేవిధంగా జగనన్న కాలనీలో 210 మందికి ఇళ్ల పట్టాలు కేటాయించి గృహాలు మంజూరు చేయడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గ్రామం అన్నివిధాలుగా ప్రగతిబాట పట్టడంతో ఎమ్మెల్యే కాటసానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారు పేరుసోముల గ్రామస్తులు.

గ్రామంలో జరిగిన కొన్ని అభివృద్ధి పనులు

- రూ.40 లక్షలతో నూతన గ్రామ సచివాలయ భవనం
- రూ.23 లక్షలతో రైతుభరోసా కేంద్రం
- రూ.5 లక్షలతో నూతన మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణం
- రూ.65 లక్షలతో వివిధ కాలనీలలో సీసీ రోడ్లు, డ్రేనేజీల నిర్మాణం.
- రూ.20 లక్షలతో గ్రావేల్ రోడ్లు
- రూ.10 లక్షలతో పైపులైన్
- రూ.91 లక్షతో ఉన్నత పాఠశాల అభివృద్ధి



మినరల్ వాటర్ ప్లాంట్



సీసీ రోడ్డు ఏర్పాటుతో కళకళలాడుతున్న కాలనీ



గ్రామ సచివాలయం

ఎమ్మెల్యే కాటసాని చొరవతో గ్రామం అభివృద్ధి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చొరవతో మా గ్రామం పూర్తి స్థాయిలో అభివృద్ధి జరిగింది. దాదాపు ప్రతి సమస్యకు ఎమ్మెల్యే పరిష్కారం చూపారు. భూమిలేని పేదలు భూ పంపిణీ చేసిన ఘనత కాటసానికే దక్కింది. సొంతింటి కల నెరవేర్చారు. గ్రామాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే సాయం మరువం.

– చిన్న బాబు, మండల ఉపాధ్యక్షుడు

సచివాలయాల సేవలు బాగున్నాయి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన సచివాలయాల సేవలు బాగున్నాయి. ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సేవలు నేరుగా అందుతున్నాయి. మండల కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే పనులు స్వగ్రామంలో జరుగుతున్నాయి. ఇంటి పట్టాలు, గృహాలు, రేషన్ కార్డు అందజేస్తున్న తీరు బాగుంది. సర్పంచ్‌గా పేదలకు న్యాయం చేశాననే సంతృప్తి ఉంది.

– అందనం శృతి, సర్పంచ్, పేరుసోముల

గతంలో బురదతో ఇబ్బందులు పడ్డాం



సీసీ రోడ్ల నిర్మాణం సంతోషకరం. గతంలో రహదారులు అధ్వానంగా ఉండేవి. ప్రత్యేకించి వర్షాకాలంలో రోడ్లు బురదమయం అయ్యేవి. చాలా ఇబ్బందులు పడ్డాం. వృద్ధులు, పిల్లలు కిందపడిన సందర్భాలు కోకొల్లలు. సీసీ రోడ్ల నిర్మాణంలో సమస్య తీరింది. చాలా సంతోషం. ఎమ్మెల్యే కాటసానికి కృతజ్ఞతలు.

– ఈడిగా లక్ష్మిదేవి, పేరుసోముల గ్రామం

వ్యవసాయానికి ఈ వారం విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లోనే తొమ్మిది గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామమోహన్ చెప్పారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, రేవనూరు, కలుగొట్ల, కోవెలకుంట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామల: మండలంలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటిపూట ఏడు గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ఫీడర్ల సంబంధించి విద్యుత్ సరఫరా వేళలు ఏఈ వివరించారు. ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, గిద్దలూరు, కానాల, ముదిగేడు, ఆర్.లింగందిన్నె, ఎగ్గొని, అక్కంపల్లె తదితర గ్రామాల ఫీడర్ల పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరుకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ వివరించారు.

సభలు, సమావేశాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి

బేతంచెర్ల: సార్వత్రిక ఎన్నికల కోడ్ నేపథ్యంలో సభలు, సమావేశాలు, ఊరేగింపులకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సీఐ ప్రీతం రెడ్డి తెలిపారు. డీజేలకు ఏలాంటి అనుమతి లేదన్నారు. అలా కాదని ఊరేగింపులలో ఎవరైనా డీజేలు వినియోగిస్తే వాహనాల యజమానులపై, డీజే నిర్వాహణ సభ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతిఒక్కరూ ఎన్నికల కోడ్ నిబంధనలు పాటించాలని సూచించారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు



నిత్యన్నదాన సంస్థలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిన దృశ్యం

బనగానపల్లె రూరల్ : మండలంలోని టంగుటూరులో వెలసిన పెద్దమ్మ గుడి వద్ద నిర్వహిస్తున్న నిత్యన్నదాన సంస్థలో భక్తుల సౌకర్యార్థం కొన్నిరోజుల కిందట నిర్వాహకులు మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆదివారం మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించిన మొత్తాన్ని నంద్యాల మండల హైస్కూల్ కొట్టాల గ్రామానికి చెందిన ముక్కు చిన్నతిరుపతిరెడ్డి, తిరుపతమ్మ దంపతులు రూ.లక్షను విరాళంగా నిత్యన్నదాన సంస్థ నిర్వాహకులు రామగంగిరెడ్డి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో దాతలతోపాటు కుటుంబ సభ్యులు శేషిరెడ్డి, శేఖర్‌రెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహానందీశ్వరుడికి అభిషేకార్చనలు



మహానందీశ్వరుడి దంపతులకు పూజలు చేస్తున్న పండితులు, అర్చకులు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకులు స్వామి, అమ్మవార్ల మూర్తులను విశేషంగా అలంకరించారు. స్థానిక అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు నిత్య కల్యాణోత్సవం పూజలు వైభవంగా చేపట్టారు. సెలవురోజు కావడంతో పలు ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వారితో పాటు కోదండరాముడు, వినాయకనందీశ్వరస్వామి, గరుడనందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో ప్రముఖులు

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో ఆదివారం రాత్రి పలువురు ప్రముఖులు పూజలు నిర్వహించారు. దేవదాయశాఖ రిటైర్డ్ కమిషనర్ సుందర్‌కుమార్, కుటుంబ సభ్యులు మహానందికి వచ్చారు. ఆలయ ఏఈఓ ఓంకారం వెంకటేశ్వరుడు వారికి స్వాగతం పలికారు. ఈ మేరకు వారు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, అర్చనలు చేపట్టారు. వారితో పాటు కర్నూలు అడిషనల్ డిస్ట్రిక్ జడ్జి ఎ.శ్రీనివాసకుమార్ దంపతులు పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతు శర్మ, శాంతారాంభట్‌లు వారికి వేదాశీర్వచనం చేసి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించారు.

రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు

బేతంచెర్ల: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో నగర పంచాయతీ పరిధిలోని రాజకీయ నాయకుల విగ్రహాలకు అధికారులు ముసుగులు వేశారు. ఎన్నికల కోడ్ నిబంధనల మేరకు పట్టణంలోని ప్రధాన రహదారి వెంట, ఆయా కూడలల్లో ఉన్న రాజకీయ పార్టీలకు సంబంధించిన బ్యానర్లను నగర పంచాయతీ సిబ్బంది తొలగించారు. ప్రతిఒక్కరూ ఎన్నిక నిబంధనలు పాటించాలని అధికారులు సూచించారు.

గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత



గ్రంథాయ అధికారి బషీర్ అహ్మద్‌కు పుస్తకాలు అందజేస్తున్న గుణవర్ధన్ రావు

బనగానపల్లె రూరల్ : స్థానిక గ్రంథాలయానికి పట్టణానికి చెందిన గుణవర్ధన్ రావు సుమారు రూ.8వేల విలువ పుస్తకాలను గ్రంథాలయ అధికారి బషీర్‌అహమ్మద్‌కు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి మాట్లాడుతూ ఇంటర్ పూర్తి చేసిన బైపీసీ విద్యార్థులు ఎంసెట్, నీట్ తదితర ప్రవేశ పరీక్షల్లో పోటీపడేందుకు 88 రకాల పుస్తకాలను గుణవర్ధన్‌రావు అందజేయడం అభినందనీయమన్నారు. గ్రంథాలయ అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

ఫొటోలు తొలగించాలి

నంద్యాల(న్యూటౌన్): పాఠశాలల సమీపంలో ఉన్న రాజకీయ నాయకుల ఫొటోలు తొలగించాలని డీఈఓ సుధాకర్ రెడ్డి అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలకు సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం నంద్యాల జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పాఠశాలలో అమలు అవుతున్న వివిధ పథకాలకు సంబంధించిన, రాజకీయ నాయకుల ఫొటోలను వెంటనే తీసేయాలని చెప్పారు. అలాగే పాఠశాలకు 100 మీటర్లలోపు ఫ్లెక్సీలు, ఫొటోలు ఉంటే పంచాయతీ సెక్రటరీకి తెలియజేసి తొలగించి ధ్రువీకరణ పత్రాలను సంబంధిత అధికారుల ద్వారా విద్యాశాఖ కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. ఇందులో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని స్పష్టం చేశారు.

నేటి నుంచి ‘పది’ పరీక్షలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల పట్టణంలో మూడు పరీక్షా కేంద్రాల్లో సోమవారం నుంచి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారభమవుతున్నట్లు ఎంఈఓ వెంకట్రామిరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్, సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలల్లో 664మంది విద్యార్థినీ, విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. ఆయా పరీక్షా కేంద్రాలకు చీఫ్ సూపర్‌వైజర్లుగా హెచ్‌ఎంలు నాగేశుడు, అరుణకుమారి, శివలక్ష్మి వ్యవహరిస్తారన్నారు. అలాగే ఆయా కేంద్రాలకు డిపార్ట్‌మెంటల్ అధికారులుగా బనగానపల్లె మండలంలోని యాగంటిపల్లె, ఇల్లూరు కొత్తపేట, బనగానపల్లె ఉన్నత పాఠశాలల స్కూల్ అసిస్టెంట్లు జానకిరెడ్డి, పాండురంగారెడ్డి, యాగంటప్పను నియమించినట్లు వెల్లడించారు.

నాలుగు కేంద్రాల్లో పదవ తరగతి పరీక్షలు

కొలిమిగుండ్ల: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, అంకిరెడ్డిపల్లె, తిమ్మనాయినపేట ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. 11 ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూల్, కస్తూర్బా నుంచి 484 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.

సంజామల: మండలంలో 408 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాస్తున్నట్లు ఎంఈఓ ఈశ్వరయ్య తెలిపారు. మండల కేంద్రం సంజామల ప్రభుత్వ పాఠశాలలో 178 మంది విద్యార్థులు, కానాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 119 మంది విద్యార్థులు, నొస్సం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 111 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు ఎంఈఓ తెలిపారు.

బేతంచెర్ల: పదవతరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ సోమశేఖర్ తెలిపారు. మండల కేంద్రం బేతంచెర్లలోని సుమేధా ఇంగ్లిష్ మీడియం స్కూల్ కేంద్రంలో-227 మంది విద్యార్థులు, సెంట్ ఆన్స్ ఉన్నత పాఠశాల -218, గ్రేస్ స్కూలు-245, ఏపీ మోడల్ స్కూలు-280, ఆర్ ఎస్ రంగాపురం-235, సిమెంట్ నగర్ స్కూల్ కేంద్రంలో 120 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 30వ తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

బనగానపల్లె రూరల్ : పదవ తరగతి పరీక్షలకు కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈఓ స్వరూప తెలిపారు. మండలంలో మొత్తం ఎనిమిది కేంద్రాల్లో 1968 మంది విద్యార్థిని, విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చెప్పారు. అలాగే పది పరీక్షలకు హాజరయ్యే గ్రామీణ విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం కల్పించిందని బనగానపల్లె ఆర్టీసీ డీఎం రవికిశోర్ తెలిపారు. విద్యార్థులు ఉన్న గ్రామాల నుంచి పరీక్ష కేంద్రం వరకు, మళ్లీ స్వగ్రామాల వరకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని తెలిపారు.

అభివృద్ధి బాట...



బెలుం శింగవరం వరకు ఏర్పాటు చేస్తున్న బైపాస్ రోడ్డు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని బెలుం గుహల సమీపం నుంచి బెలుం శింగవరం రోడ్డు వరకు ఏర్పాటు చేస్తున్న బెలుం బైపాస్ రోడ్డు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి చొరవ తీసుకొని ప్రభుత్వం నుంచి రూ.1.27 కోట్లు మంజూరు చేయించారు. ప్రస్తుతం మట్టి చదును చేసే పనులు పూర్తయ్యాయి. త్వరలోనే తారురోడ్డు పనులు మొదలు పెట్టనున్నారు. బెలుం వాసుల ఎన్నో ఏళ్ల కల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నెరవేరుతుంది. ప్రధాన రహదారిలో రాక పోకలు సాగించే వాహనాల సంఖ్య పెరిగిపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. కోవెలకుంట్ల, నంద్యాల ఆళ్లగడ్డ తదితర ప్రాంతాల ప్రయాణికులు ఈమార్గంలోనే ఎక్కువగా వెళ్తుంటారు. బైపాస్ ఏర్పాటు కానుండటంతో బెలుం ప్రధాన రహదారితో సంబంధం లేకుండా బెలుం గుహల నుంచి నేరుగా ఊరివెలుపల రాక పోకలు సాగించే వెసులుబాటు వస్తుంది. దీంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి పథంలో పెద్దవెంతుర్ల

- మండల కేంద్రానికి దూరంగా గ్రామం
- రూ.1.36 కోట్లతో అభివృద్ధి పనులు



ఆధునీకరించిన అంగన్‌వాడీ కేంద్రం



గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు



రైతు భరోసా కేంద్రం



గ్రామ సచివాలయ భవనం

కొలిమిగుండ్ల: దశాబ్దాలుగా పల్లెలు అభివృద్ధికి నోచుకోక సమస్యలతో సతమతమవుతుండేవి. ప్రభుత్వాలు, పాలకులు మారినా పల్లె ప్రజల కష్టాలు తీరలేదు. మండల కేంద్రాలకు సుదూరంగా విసిరేసినట్లు ఉండే గ్రామాల ప్రజల పరిస్థితి మరీ దారుణంగా ఉండేది. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్ల నుంచే పట్టణం,గ్రామం అనే తేడా లేకుండా అభివృద్ధి పథంలో నడిపించారు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి గాంధీజీ కలల కన్న గ్రామ స్వరాజ్యాన్ని చేసి చూపించారు. పెద్దవెంతుర్ల మండల కేంద్రానికి 22 కి.మీ దూరంలో మారుమూల గ్రామం. ఇక్కడ రెండు వేలకు పైగానే జనాభా ఉన్నారు. వ్యవసాయంపైనే ఎక్కువ భాగం ఆధారపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఎన్నో ఏళ్లుగా నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమయ్యాయి. రూ.1.36 కోట్లకు పైగానే వ్యయంతో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, అంగన్‌వాడీ భవనం, సీసీ రోడ్లు, క్లోజింగ్ డ్రైనేజీ తదితర పలు అభివృద్ధి పనులు పూర్తి చేశారు.

ఊర్లోనే అన్ని సేవలు

ప్రభుత్వ కార్యాలయాల్లో ఏచిన్న పని కోసం వెళ్లాలన్నా గ్రామస్తులు మండల కేంద్రం కొలిమిగుండ్లకు వెళ్లాల్సి వస్తుండేది. రవాణ సౌకర్యం లేకపోగా సంజామల మండలం పేరుసోముల నుంచి కొలిమిగుండ్లకు చేరుకునేవారు. ప్రస్తుతం ఊర్లోనే గ్రామ సచివాలయం ఏర్పాటు చేయడంతో అన్ని సేవలు అందుతున్నాయి. గత ప్రభుత్వంలో ఒకటి, రెండు చోట్ల సీసీ రోడ్లు వేసి చేతులు దులుపుకున్నారు తప్ప శాశ్వత సమస్యలపై దృష్టి సారించడంలో విఫలమయ్యారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పరిపాలన పరమైన భవనాలు, అభివృద్ధి పనులు జరగడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులు

- రూ.43 లక్షలతో గ్రామ సచివాలయ భవనం నిర్మాణం
- రూ.21.50 లక్షలతో రైతు భరోసా కేంద్రం ఏర్పాటు
- రూ.15 లక్షలతో చిన్నారుల కోసం అంగన్‌వాడీ భవనం నిర్మాణం
- రూ.27 లక్షలతో రెండు చోట్ల సీసీ రోడ్ల నిర్మాణం
- రూ.20 లక్షలతో ఎస్సీ కాలనీ నుంచి ఓవర్ హెడ్ ట్యాంక్ వరకు క్లోజింగ్ డ్రైనేజీ నిర్మాణం
- మంచినీటి సమస్య తలెత్తకుండా రూ.2.50 లక్షలతో బోరు,పైపులైన్
- రూ.6లక్షలతో విద్యుత్ స్తంభాల ఏర్పాటు
- టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీలో రూ.10 లక్షలతో మారెమ్మ గుడి నిర్మాణం

ఇబ్బందులు తొలగిపోయాయి



ప్రతి చిన్న పనికి కొలిమిగుండ్లకు పోవాల్సి ఉండేది. రవాణ సౌకర్యం లేక పోవడంతో దూరంగా ఉండటంతో చాలా కష్టాలు పడేవాళ్లం. ప్రభుత్వం వచ్చాక ఊర్లోనే గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం ఏర్పాటుతో మా ఇబ్బందులు తొలగిపోయాయి. పనులు మానుకొని పోవాల్సిన అవసరం లేకుండా పోయింది. ఊర్లోనే సేవలు అందుతాయని ఊహించలేదు.

– గోపాల్‌రెడ్డి, గ్రామస్తుడు

ఎమ్మెల్యే చొరవతో గ్రామాభివృద్ధి



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి చొరవతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకున్నాం. ఎప్పుడు ఏసమస్య వచ్చినా తక్షణమే మా గ్రామం కోసం వారు ముందుంటారు. ప్రభుత్వం వచ్చాక శాశ్వత సమస్యలు పరిష్కరించారు. ఇటీవలనే గాలేరు నగరి కాల్వ ద్వారా నీళ్ల వదలడంతో మిరప రైతులుకు చాలా ఊరట కలిగింది.

– వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు